క్లుప్తంగా

చల్లబడ్డ వాతావరణం



సుల్తానాబాద్‌లోని ఎమ్మార్సీ భవనంపై పడిన చెట్టు

సుల్తానాబాద్: వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ప్రజలు ఊపిరి తీసుకుంటున్నారు. 2నెలల నుంచి ఉక్కపోతతో బయటకు వెళ్లేందుకు ప్రజలెవరూ సాహసించలేదు. కేంద్ర వాతావరణ శాఖ నైరుతి రుతు పవనాలు ఈనెల 5న తెలంగాణకు వస్తాయని ప్రకటించగా.. మూడు రోజుల ముందుగానే తాకాయి. వాతావరణంలో మార్పులు రావడంతో ఉక్కపోత నుంచి కొంత ఉపశమనం లభించినట్లు ప్రజలు భావిస్తున్నారు. ఏసీ, కూలర్లు, ఫ్యాన్లు 24 గంటలు తిరిగినా.. ఉక్కపోత నుంచి ఉపశమనం కలగలేదని, వర్షం కురవడంతో హాయిగా ఉందంటున్నారు.

పరామర్శ

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన గంగిపెల్లి వజ్రమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై మరణించగా.. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ మృతురాలి కుటంబ సభ్యులను పరామర్శించారు. 50కిలోల బియ్యాన్ని అందజేశారు. కోడూరి మహేశ్, మేర శ్రీనివాస్, అమరగాని పురుషోత్తం, ఆంకూస్, జంగం వీరయ్య, గంగిపెల్లి భూమయ్య, శ్రీనివాస్, నగునూరి నారాయణ తదితరులున్నారు.

విత్తన విక్రయదారులు విధిగా రశీదులివ్వాలి

కాల్వశ్రీరాంపూర్: విత్తన విక్రయదారులు రైతులకు విధిగా రశీదులివ్వాలని ఏవో నాగార్జున విత్తన వ్యాపారులను ఆదేశించారు. సోమవారం కాల్వశ్రీరాంపూర్‌లో విత్తన విక్రయ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విత్తనాల ప్యాకెట్లు, బ్యాగులపై కంపెనీ పేరు, బ్యాచ్ నంబర్, విడుదలైన తేదీ, విక్రయించిన తేదీ, రైతు పేరు రశీదులపై రాయాలని సూచించారు. వ్యాపారులు తమ వ్యాపార కేంద్రాల్లో స్టాక్ బోర్డును ప్రదర్శించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని, పీడీ యాక్టు నమోదుకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఏఈవోలు రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అందరి సహకారం అవసరం



సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ

మంథని: మంథని మున్సిపాలిటీ పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజల సహకారం అవసరమని, వ్యాపారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని, సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ కోరారు. సోమవారం పట్టణంలోని పలు వ్యాపార కూడళ్లలో పర్యటించారు. మున్సిపల్ సిబ్బంది నిత్యం చెత్తను సేకరిస్తున్నారని, రోడ్డుపై వేయొద్దని, అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలన్నారు. మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నోటీసులు జారీ చేసి జరిమానా విధిస్తామన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు వీకే రవి, చొప్పకట్ల హనుమంతు, కుర్ర లింగయ్య తదితరులున్నారు.

సేవే సంకల్పం..



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: తోటి మనిషికి సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని శ్రీసత్యసాయి సేవాదళ్ ప్రతినిధి నూక రమేశ్ అన్నారు. సేవే సంకల్పంగా శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం యైటింక్లయిన్‌కాలనీలోని 15 మంది నిరుపేద కుటుంబాలకు అమృత కలశాల పేరుతో బియ్యంతోపాటు నిత్యావసర సరుకులను అందజేశారు. చంద్రప్రకాశ్, మహేందర్, చారి, రాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు

జూలపల్లి: మండల కేంద్రంలో జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మార్కేండేయ ఆలయ ఆవరణలో పద్మశాలీ సంఘం మండల యువజన నాయకుడు మేరుగు రమేశ్, మందోట వద్ద కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకుడు ఆతిక్‌పాషా ఆధ్వర్యంలో కేక కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సంబారి ఆంజనేయులు, కొడూరి మహేశ్, బైరి భూమయ్య, సంబారి శ్రీనివాస్ తదితరులున్నారు.

సేంద్రియ సాగుకు రైతుల మొగ్గు

- పంట పొలాల్లో గొర్రెల మందలు, పశువుల పేడ
- రసాయన ఎరువుల తగ్గింపుపై రైతుల ఆసక్తి



ధూళికట్టలోని పొలంలో వేసిన కోళ్ల ఎరువు

ఎలిగేడు: రైతులు మారుతున్న కాలానికనుగుణంగా వ్యవసాయ సాగు విధానాలను అవలంబిస్తున్నారు. రసాయన ఎరువులను వినియోగించడం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి పెట్టారు. ఎలిగేడు మండలం ముప్పిరితోట, ధూళికట్ట, ఎలిగేడు, సుల్తాన్‌పూర్, లాలపల్లి, శివపల్లి, నర్సాపూర్, ర్యాకల్‌దేవుపల్లి, నారాయణపల్లి, లోకపేట, రాములపల్లి, బుర్హాన్‌మియాపేట గ్రామాల్లో ఖరీఫ్ పనులకు ముందు రైతులు తమ పంట పొలాల్లో గొర్రెల మందను పెట్టిస్తున్నారు. పశువుల పేడ(పెంట), కోళ్ల ఎరువును పొలాల్లో నేల సారవంతం కావడానికి వాడుతున్నారు.

రసాయన ఎరువుల ధరల పెంపుతో..

పంటల సాగులో ఉపయోగించే రసాయన ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. డీఏపీ, యూరియా, పొటాష్ తదితర ఎరువుల ధరలు పెరగడంతోపాటు రసాయన ఎరువులను ఎక్కువగా వినియోగించడంతో దిగుబడులు తగ్గుతున్నాయి. ధరల పెంపుతో తెగుళ్లు ఎక్కువగా ఆశించడంతో రైతులందరూ రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపుతున్నారు. పెట్టుబడులను తగ్గించుకొని సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. పలువురు రైతులు గతేడాది రబీ సీజన్‌లో మిషన్ కాకతీయ కింద చెరువుల పూడికతీత సందర్భంగా నల్ల మట్టిని పొలాల్లో పోయించుకుంటున్నారు. పొలాలు సారవంతంగా మారే అవకాశముండటంతో నల్ల మట్టి వైపు రైతులు మొగ్గు చూపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభంతో ముందస్తుగానే పలువురు రైతులు గొర్రెల మందలను పెట్టించడంతోపాటు పశువుల పేడను పొలాల్లో పోస్తున్నారు. జనుము, జీలుగ విత్తనాలను వేసిన అనంతరం పొలంలో కలియ దున్నితే నేల సారవంతతమవుతుంది. ఈ సీజన్‌లో దాదాపు 5,500 హెక్టార్లలో వివిధ పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. కోళ్ల ఎరువును రైతులందరూ వినియోగించేందుకు ఆసక్తి చూపడంతో డిమాండ్ ఏర్పడింది. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం వైపు అడుగులేస్తుండటంతో దిగుబడులు పెరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

భూసారం పెంపు కోసం..



పంట పొలాల్లో భూసారం పెంపు కోసం పశువుల పేడతో కూడిన పెంటను పొలాల్లో చల్లుతున్నాం. రెండేళ్లుగా నాణ్యమైన దిగుబడులు వస్తున్నాయి. పలు గ్రామాల్లో సైతం రైతులు కోళ్ల ఎరువులు వేస్తూ గొర్రెల మందలను సైతం భూసారం పెంపు కోసం పెట్టిస్తున్నారు.

– భూసారపు శ్రీకాంత్, యువ రైతు, ధూళికట్ట, ఎలిగేడు మండలం

సేంద్రియ ఎరువులతో నాణ్యమైన దిగుబడులు

రైతులు తమ పంట పొలాల్లో సేంద్రియ ఎరువులను వేస్తే నాణ్యమైన దిగుబడులు సాధించొచ్చు. పశువుల పేడ, చెరువు మట్టిని పొలాల్లో వేసుకోవడం, గొర్రెల మందను ఉంచడం, వర్మీకంపోస్టు, దేశీయ ఆవు పేడ, ఆవు మూత్రం వ్యవసాయంలో వాడితే నాణ్యమైన దిగుబడులొస్తాయి.

– ఉమాపతి, వ్యవసాయ శాఖ అధికారి, ఎలిగేడు మండలం

'కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లపై చర్య తీసుకోవాలి'



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వేధిస్తున్న కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ డిపో సెక్యూరిటీ విజిలెన్స్ ఇన్‌చార్జి అఖిలకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దెల దినేశ్ మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులు శివ, రాజు, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు సూచించారు. సోమవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో రక్షణ, బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణాపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓసీపీ–1, 2 ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, ఓబీ(మట్టి వెలికితీత) లక్ష్యాలపై చర్చించి వివిధ విభాగాల పనితీరును విశ్లేషించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని అన్నారు. లక్ష్యాల సాధనకు ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. రాబోయే వర్షాకాలంలో ఓసీపీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చేపట్టాల్సిన చర్యలను సూచించారు. సమావేశంలో ఏరియా ఇంజినీర్ ఎలీషా, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసు, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ప్రాజెక్టు అధికారులు రమేశ్, రాజేందర్, ఏరియా సేఫ్టీ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

చిత్ర కథ



అలంకారప్రాయంగా నీటి తొట్టెలు

ఫెర్టిలైజర్‌సిటీ: వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో పశువుల దాహార్తి తీర్చేందుకు రామగుండం నగరపాలక సంస్థ పశువులు సంచరించే చోట నీటి తొట్టెలను ఏర్పాటు చేసింది. రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ రైల్వే గేట్ సమీపంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో నెల రోజులు గడిచినా నీటిని నింపలేదని స్థానికులు తెలిపారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెల్లో నీరు నింపేలా చర్యలు చేపట్టాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

అధ్వానంగా ఎస్సీ హాస్టల్ భవనం

- కోవిడ్ ముందు నుంచే క్రమంగా తగ్గుతున్న విద్యార్థులు
- హాస్టల్ భవన నిర్మాణం పట్టించుకోని పాలకులు



పిచ్చి మొక్కలతో ఎస్సీ హాస్టల్ భవనం

రామగుండం: పట్టణంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌కు అనుబంధంగా ప్రాంగణ పరిధిలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం కాలక్రమేణా కాలగర్భంలో కలిసిందనేది స్పష్టమవుతోంది. మరో వారం రోజుల్లో బడిబాట ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, నాణ్యమైన విద్యాబోధన, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదిత సౌకర్యాలతోపాటు అర్హులైన బోధన సిబ్బంది, డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు తదితర అంశాలపై ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు ఉపాధ్యాయులు బడిబాట చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా.. హైస్కూల్‌కు అనుబంధంగా ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం క్రమంగా శిథిలావస్థకు చేరి స్లాబు పైపెచ్చులు ఊడిపోవడంతో ప్రతీ ఏటా వర్షాకాలంలో వరద నీరు పూర్తిగా నివాస గదుల్లోకి చేరేది. రాత్రివేళల్లో వరద నీటితోపాటు స్లాబు పైపెచ్చులు విద్యార్థులపై పడడంతో అధికారులు గుర్తించి ప్రత్యామ్నాయంగా జూనియర్ కళాశాల పాత భవనంలోకి విద్యార్థుల మకాం మర్చారు. కాలకృత్యాలకు మాత్రం హాస్టల్‌లోనే కొనసాగించారు. ఈ భవన దుస్థితితో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతూ కాలక్రమేణా విద్యార్థులను చేర్పించేందుకు పేరెంట్స్ మొగ్గు చూపించకపోవడంతో హాస్టల్ ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో ఎస్సీ విద్యార్థులకు ప్రత్యేక వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పొరుగు మండలాల నుంచి స్థానికంగా వసతి పొంది హైస్కూల్‌లో చదువుకునే విద్యార్థులకు అవకాశం లేకుండా పోయింది.

ఏడేళ్లుగా కాలయాపన

ఏడేళ్ల క్రితమే అప్పటి హాస్టల్ వార్డెన్, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఎన్టీపీసీ సీఎస్‌ఆర్ నిధులతో నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు ఒప్పించారు. అదే సమయంలో భవన నిర్మాణంపై డిజైన్ సైతం రూపొందించారు. ఈ క్రమంలో వార్డెన్ ఉద్యోగ విరమణతోపాటు రెండేళ్ల కోవిడ్ రావడం, ఉద్యోగ బదిలీలతో హాస్టల్ నిర్మాణం మరుగున పడింది. అదే సమయంలో అప్పటి ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో సత్వరమే హాస్టల్ నిర్మించాలని ఒత్తిడి తీసుకొచ్చినా.. పలు కారణాలతో వాయిదాలు పడుతూ కాలక్రమేణా హాస్టల్ నిర్మాణం ఊసే లేకుండా పోయింది. ఫలితంగా హాస్టల్ భవనం పూర్తిగా కుప్పకూలిపోయి ప్రాంగణం పిచ్చి మొక్కలతో నిండిపోయి కాలగర్భంలో కలిసినట్లయింది.

ప్రవేశాలపై ప్రభావం

గతంలో ఎస్సీ విద్యార్థులు హైస్కూల్‌లో ప్రవేశం పొందిన తర్వాత స్థానికేతర ఎస్సీ విద్యార్థులకు అదే ప్రాంగణంలో ఉండే హాస్టల్‌లో వసతి కల్పించేవారు. కాలక్రమేణా ప్రభుత్వం ప్రతీ మండల పరిధిలో గురుకుల విద్యాలయాలు స్థాపించడంతో.. పొరుగు మండలాల నుంచి వచ్చే విద్యార్థుల ప్రవేశాలు తగ్గిపోయాయి. ఈ కారణం కూడా హాస్టల్ భవన నిర్మాణంలో జాప్యానికి కారణంగా భావించొచ్చు.

పరిసరాలు శుభ్రం చేయాలి



హైస్కూల్ ప్రాంగణంలో శిథిలావస్థకు చేరి పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉన్న పరిసరాలను శుభ్రం చేయించాలి. రాబోయే వర్షాకాలంలో విష ప్రాణులు సంచరించే అవకాశముండడంతో.. ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. హాస్టల్ నూతన భవన నిర్మాణ విషయమై తనకు అవగాహన లేదు. ఇప్పటికే కొంతమేర శుభ్రం చేయించా. హైస్కూల్‌లో అన్ని తరగతులకు సరిపడా బోధన సిబ్బందితోపాటు డిజిటల్ తరగతి గదులతో ఆధునిక విద్యాబోధన చేస్తున్నాం.

– అజ్మీరా శారద, హెచ్ఎం, రామగుండం హైస్కూల్

స్వయం ఉపాధికి ప్రోత్సాహం

జూలపల్లి: నిరుద్యోగుల స్వయం ఉపాధికి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహమందిస్తుందని పెద్దపల్లి శాసన సభ్యుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో కొత్తూరుకు చెందిన ఎస్.వంశీ ఏర్పాటు చేసుకున్న ప్రియ మిల్క్ పార్లర్‌ను ఆయన ప్రారంభించారు. నిరుద్యోగులకు ప్రభుత్వం ఉపాధి ఆవకాశాలు కల్పించేందుకు పకడ్బందీగా ప్రణాళికలు అమలు చేస్తామని, రాబోయే రోజుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జూలపల్లి, ధూళికట్ట సింగిల్‌విండో చైర్మన్లు కొంజెర్ల వెంకటయ్య, వేణుగోపాలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నర్సింహయాదవ్, నాయకులు లోక జలపతిరెడ్డి, గండు సంజీవ్, పొట్టాల శంకరయ్య తదితరులున్నారు.

కార్మికులకు చట్టపరమైన బోనస్ అమలు చేయాలి



కార్మికులతో నాయకులు

రామగుండం: రైల్వే సంస్థలో వివిధ క్యాటగిరీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ చట్టపరమైన బోనస్ చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకు సోమవారం సంబంధిత కాంట్రాక్టు సంస్థ శ్రీబాలాజీ ఇంజనీరింగ్ ఎంటర్‌ప్రైజెస్, కార్మికుల పక్షాన సీఐటీయూ అనుబంధ తెలంగాణ రైల్వే క్యాజువల్ కాంట్రాక్టు ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్‌తో పలు అంశాలపై జరిగిన చర్చల్లో ఒప్పందం కుదిరింది. ఇందులో ఏడాదిలో ఒక జత నాణ్యమైన బూట్లు, జత యూనిఫాం కుట్టించి ఇవ్వడం, పెరిగిన వీడీఏ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు చేయడం, ప్రతినెల వేతన చెల్లింపులకు ముందు వేతన స్లిప్పులివ్వడం, నూతన టెండర్లలో సీ గ్రేడ్, అడిషనల్ మ్యాన్ పవర్ కార్మికులకు బోనస్ వర్తింపజేయడం, మిగతా రైల్వే ఓవర్ హాలింగ్ షెడ్, సైసింగ్, హౌస్ కీపింగ్ కార్మికులకివ్వడానికి అంగీకారం కుదిరింది. ఈ విషయమై కాంట్రాక్టు సంస్థతో కుదిరిన ఒప్పంద అంశాలపై రామగుండం వ్యాగన్ డిపో వద్ద కార్మికులకు వివరించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, ఉపాధ్యక్షుడు ఎన్.భిక్షపతి, ఎండీ యాసిన్, ఉప్పులేటి సరళ, కనుకుంట్ల తిరుపతి, ఇంజంపల్లి ప్రదీప్, మురళి, ఇష్తాకార్, రాజమౌళి, సాయి, అమృత తదితరులున్నారు.

కేశోరాం మేనేజర్‌ను కలిసిన కార్మిక సంఘం నాయకులు



మేనేజర్‌ను సత్కరిస్తున్న నాయకులు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం నూతన హెచ్ఆర్ అండ్ ఐఆర్ మేనేజర్‌గా నియమితులై బాధ్యతలు స్వీకరించిన పార్థసారథిని కేశోరాం పర్మినెంట్ కార్మిక సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్, ప్రసాద్, నగునూరి రమేశ్, ఈదునూరి నారాయణ, దామోదర్, శ్రీనివాస్ తోపాటు పలువురు కార్మికులు మేనేజర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కంపెనీలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారంలో యూనియన్‌తో సహకరించాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డుపై చెత్త ఉందని అనుకుంటున్నారా..



జ్యోతినగర్: రోడ్డుపై చెత్తను ఇలా ఉంచారా అని అనుకుంటున్నారా. అయితే పొరబడినట్లే. మున్సిపల్ పారిశుధ్య విభాగం ఆటో ట్రాలీ వెనకభాగం నిండా చెత్త, ప్లాస్టిక్ వస్తువులతో ఉన్న సంచులను వేలాడదీయడంతో అసలు ఆటో ట్రాలీ కనిపించడం లేదు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో మున్సిపల్ ఆటో ట్రాలీ వెనక చెత్త సంచులతో నిండిపోయింది. ఆటో నంబర్ కూడా కనిపించడం లేదు. పెద్ద వాహనం ఏదైనా చెత్త కుప్ప అని పక్కగా వచ్చి ఢీకొంటే ప్రమాదాలు జరిగే ఆస్కారాలు లేకపోలేదు. పారిశుధ్య విభాగం వారు ఆటో ట్రాలీలో చెత్తను తీసుకెళ్లేటప్పుడు దానిపై కవరు కూడా వేయకపోవడంతో.. గాలికి చెత్త రోడ్డుపై పడుతోంది. సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

లారీ, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయ సమీపంలో సోమవారం లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో పల్లె సారయ్య అనే ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సారయ్య తన కుటుంబీకులతో పెద్దపల్లి నుంచి సొంత గ్రామం కొలనూర్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

ఆదరణ కోల్పోతున్న ఎన్టీపీసీ పీటీఎస్ షాపింగ్ కాంప్లెక్స్



ఎన్టీపీసీ పీటీఎస్ మెయిన్ షాపింగ్ కాంప్లెక్స్



మూసి ఉన్న దుకాణాలు

- 34 దుకాణాలకు 12 వినియోగం



షాపింగ్ కాంప్లెక్సులో చెత్త

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ గ్రీనరీకి పెట్టింది పేరు. సంస్థ ప్రారంభంలో నాటిన మొక్కలు నేడు వృక్షాలై చల్లని వాతావరణంతో కనువిందు చేస్తున్నాయి. 2,000 మంది ఉద్యోగులు నివసించే పర్మనెంట్ టౌన్‌షిప్‌లో మెయిన్ షాపింగ్ కాంప్లెక్స్‌తోపాటు మరో మూడు మినీ షాపింగ్ కాంప్లెక్సులు కట్టి ఉద్యోగులు అన్ని వస్తువులు టౌన్‌షిప్‌లో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఉద్యోగుల శాతం తక్కువ కావడంతో మెయిన్ షాపింగ్‌లో ఉన్న సుమారు 34 దుకాణాల్లో 12 మాత్రమే వినియోగంలో ఉన్నట్లు సమాచారం. దీంతో కొనుగోలుదారుల్లేక వ్యాపారాలు చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. టౌన్‌షిప్‌లో దుకాణాలు కేటాయించినవారికి వసతి కూడా కల్పించేందుకు అద్దె ప్రాతిపదికన క్వార్టర్లను కేటాయించారు. చాలా సంవత్సరాల నుంచి పీటీఎస్‌లో ఉండి వ్యాపారాలు చేస్తున్నారు. కేవలం సీ టైపు క్వార్టర్ ఏరియాలోని మినీ షాపింగ్ కాంప్లెక్స్ కొంతమేర ఆశించిన వ్యాపారాలు సాగిస్తున్నాయి. మెయిన్ షాపింగ్‌తోపాటు మరో రెండు మినీ షాపింగ్ సెంటర్లు ఆదరణ కోల్పోతున్నాయి. సంస్థ యాజమాన్యం షాపింగ్ కాంప్లెక్సులో నూతన టెక్నాలజీకనుగుణంగా మార్పిడి చేసి ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కొత్తగా ఆలోచన చేయాలని, లేకుంటే మెయిన్ షాపింగ్ కాంప్లెక్సు ఆదరణ కోల్పోయే అవకాశాలున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మంథని: ఖానాపూర్ గ్రామానికి చెందిన పర్శవేణి సంజయ్‌కుమార్ గేదె వన్యప్రాణుల కోసం వేసిన విద్యుత్ ఉచ్చులో పడి మృతిచెందింది. మేత కోసం గ్రామ సమీపంలోకి వెళ్లి మృత్యువాత పడిన గేదె విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.